# పసుపుమయం మల్లన్న క్షేత్రం

- భక్తిశ్రద్ధలతో పెద్దపట్నం, అగ్నిగుండం
- భక్తులతో కొక్కిరిసిన కొమురవెల్లి
- బండారి కోసం ఎగబడిన భక్తులు

చేర్యాల, జనవరి 22: సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న పుణ్యక్షేత్రం పసుపుమయంగా మారింది. హైదరాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో కొమురవెల్లి మల్లికార్జున స్వామివారి క్షేత్రంలో సోమవారం పెద్దపట్నం, అగ్నిగుండాల కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా పంచవర్ణాలతో పెద్దపట్నం తయారుచేసిన నిర్వాహకులు.. తర్వాత పంచ పల్లవాలు (ఐదు రకాల మామిడి, జువ్వి, రాగి, మేడి, మర్రి)ల కట్టెలను వరుసుగా పేర్చి అగ్నిగుండంగా మార్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి పెద్దపట్నం, అగ్నిగుండం వరకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. పెద్దపట్నం, అగ్నిగుండాలను దాటిన తర్వాత భక్తులు స్వామివారి ఆలయంలోకి ప్రవేశించి మల్లికార్జున స్వామి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మలను దర్శించుకున్నారు. శివసత్తులు, ఘనాచార్యులకు ఆలయ ఈవో బాలాజీ, ఆలయ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు కండువా, జాకెట్ ముక్కలతోపాటు స్వామివారి బండారిని పంపిణీ చేశారు.


కొమురవెల్లి మల్లన్న పుణ్యక్షేత్రంలో అగ్నిగుండం దాటుతున్న భక్తులు


నాగోబా జాతరలో భాగంగా గంగాజలం తీసుకురావడానికి కాలినడకన వెళ్తున్న మెస్రం వంశీయులు

# గిరిజన జాతరలు

- ప్రతి సంవత్సరం పుష్యమాసంలో సందడి
- ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక
- కేస్లాపూర్ నాగోబా జాతర ప్రక్రియ షురూ
- దర్శనానికి పలు రాష్ట్రాల నుంచి భక్తుల రాక

ఆదిలాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసుల జాతరల సందడి ప్రారంభమైంది. తమ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన జాతరలను ప్రతిఒక్క ఆదివాసీ ఎంతో నిష్టతో నిర్వహిస్తారు. జాతరల ద్వారా దశాబ్దాల చరిత్ర ఉన్న తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారు. ఏటా పుష్యమాసంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏదో ఒక చోట జాతరలు జరుగుతాయి. ఈ జాతరలకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరై దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకుంటారు.

### జాతరలో సేద తీరడం, దూరపు బంధువులను కలవడం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఏటా వానకాలం ప్రారంభమైనప్పటి నుంచి సాగులో బిజీగా ఉండే గిరిజనులు పుష్యమాసంలో వచ్చే జాతరలకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ జాతరల్లో తమ దేవతలకు పూజలు చేయడం, ఇష్టమైన నైవేద్యాలను సమర్పించడం, తమను చల్లగా చూడాలంటూ వేడుకోవడం, జాతర పరిసరాల్లో సేద తీరడం, తమ దూరపు బంధువులను కలుసుకుంటారు. కెరమెరి మండలంలోని భీమల్‌పెన్, ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర, నార్నూర్ మండలంలో ఖాందేవ్ జాతర, ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లో బుడుందేవ్, సిర్పూర్(యు) మండలంలో మహాదేవ్, కెరమెరి మండలం ఉన్న జంగుబాయి గుహల్లోని దేవుళ్లు గిరిజనులకు ఆరాధ్య దేవతలు. గిరిజనులు పొలిమేర పండుగతోపాటు గ్రామ దేవతలైన పెర్సపేన్, భీందేవరలకు పూజలు నిర్వహించి జంగుబాయికి పూజలు చేస్తారు. మేడారం తర్వాత ఆదిలాబాద్ జిల్లాలో అతి పెద్ద గిరిజన జాతర కేస్లాపూర్ నాగోబా సందడి ప్రారంభమైంది. గంగాజాలాన్ని సేకరించడానికి కాలిబాటన మెస్రం వంశీయులు బయలుదేరారు.

### తొడసం వంశీయుల ఇలవెల్పు ఖాందేవ్

ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం కేంద్రంలో ఖాందేవ్ ఆలయం ఉన్నది. తొడసం వంశీయులు ఇలవెల్పు అయిన ఖాందేవ్‌కు ప్రత్యేక పూజలతో ఈ జాతర ప్రారంభమవుతుంది. ఐదు రోజులపాటు జాతర కొనసాగుతుంది. ఈ జాతరలో తొడసం వంశీయుల ఆడపడుచు రెండు లీటర్ల నువ్వుల నూనె తాగడం సంప్రదాయం. నూనెతో ఖాందేవ్‌కు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం తొడసం మహిళల బేటింగ్ ఉంటుంది. తెలంగాణతోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు జాతరకు తరలివస్తారు.

### మెస్రం వంశీయుల ఆరాధ్యదైవం నాగోబా

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా మెస్రం వంశీయుల ఆరాధ్యదైవం. ఈ జాతర ప్రారంభానికి 25 రోజుల ముందుగానే మెస్రం గిరిజనులు ఏర్పాట్లను ప్రారంభిస్తారు. మహాపూజ కోసం గంగాజలం తీసుకొచ్చేందుకు రావాలంటూ మెస్రం వంశీయులు గ్రామాల్లో వారం రోజులు తిరుగుతూ రథం ద్వారా ప్రచారం నిర్వహిస్తారు. నాగోబాకు పూజలు నిర్వహించేందుకు జన్నారం మండలంలోని గోదావరి వద్ద గల హస్తినమడుగుకు నడుచుకుంటూ వెళ్లి గంగాజలాన్ని సేకరిస్తారు. కలశంలో జలాన్ని తీసుకుని కేస్లాపూర్‌కు తిరుగు పయానం అవుతారు. నాగోబా ఆలయం సమీపంలో ఉన్న మర్రిచెట్టు వద్ద మెస్రం వంశీయులు నాలుగు రోజులపాటు సేద తీరుతారు. పుష్యమాసం అమవాస్య రోజు గంగాజలంతో నాగోబాకు పూజలు నిర్వహిస్తారు. ఏటా ఆ రోజు నుంచి జాతర ప్రారంభమవుతుంది. తెలంగాణ నుంచే కాకుండా ఇతర రాష్ట్రల నుంచి కూడా లక్షలాది మంది ప్రజలు నాగోబాను దర్శించుకుంటారు.


కెరమెరి మండలం మహారాజ్‌గూడ అటవీ ప్రాంతంలో జంగుబాయి దేవత గుహ ముందు భక్తులు

### జంగుబాయి జాతర

మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో గల కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని మహారాజ్‌గూడ ప్రాంతంలోని గుహల్లో జంగుబాయి దేవత కొలువై ఉంటుంది. ప్రస్తుతం జంగుబాయి జాతర జరుగుతుంది. సహ్యాద్రి పర్వతాలతో అందాలొలికే సుందర దృశ్యాలు, నీటి ప్రవాహం పక్కన ఉన్న గుహల్లో జంగుబాయి ఆలయం ఉన్నది. శార్దూల వాహిణి రూపంలో దుర్గాదేవి ప్రతిరూపం జంగుబాయి అని స్థానికుల నమ్ముతారు. ఏటా పుష్యమాసంలో జంగుబాయిని పూజిస్తారు. నెల రోజులుగా ఈ జాతర కొనసాగుతుంది.

### చీకటి గుహల్లో భీమల్‌పెన్

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కప్లాయి చీకటి గుహలో ఆదివాసీ గిరిజనులు ఏటా భీమదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తిశ్రద్ధలతో జరుపుకొనే ఈ వేడులకు ఎంతో ప్రాధాన్యం ఉన్నది. ఐదు రోజులు దీపారాధన చేస్తూ, అనంతరం పల్లెల్లో భీమదేవుని ఉత్సవాలు నిర్వహించనున్నారు. సంస్కృతి, సంప్రదాయాలతో నియమాలను పాటిస్తూ వేడుకలు జరుపుకుంటారు. గ్రామంలో తమ పూజారి ఇంట్లో ఉన్న భీమదేవునికి పూజలు నిర్వహించి గ్రామస్థులు డోలు, వాయిద్యాలతో గుహలోకి వెళ్తారు. అక్కడ కోనేరులో స్నానమాచరించి అనంతరం పూజరులు దేవతలకు పూజలు నిర్వహిస్తారు. పుష్యమాసం వరకు ఇక్కడ భక్తుల రద్దీ కొనసాగుతుంది. గోండు, ప్రధాన్, కొలాం తెగకు చెందిన ఆదివాసీలు ఈ పూజల్లో ఎక్కువ సంఖ్యలో హాజరై గుహను దర్శించుకుని దేవున్ని కొలుస్తారు.


పోచారంలోని రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి


వేల్పూర్ రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

# మార్మోగిన రామనామం

- అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠను వీక్షించిన భక్తులు
- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు పోచారం, వేముల

వేల్పూర్/బాన్సువాడ, జనవరి 22: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని రామాలయాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఊరూరా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూర్ రామాలయంలో నిర్వహించిన పూజల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయోధ్య కరసేవకులను సన్మానించారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, వర్ని, మోస్రా మండలాల్లోని రామాలయాల్లో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పూజలు చేశారు.

# వరంగల్ సైనిక్ స్కూల్ హైదరాబాద్‌కు!

- కంటోన్మెంట్‌లో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- ఇదే జరిగితే ఓరుగల్లుకు అన్యాయం తప్పదంటున్న నిపుణులు



హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తి అండగా నిలిచిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు కాంగ్రెస్ సర్కారు తీరని అన్యాయం చేసేందుకు సిద్ధమవుతున్నది. ఈ జిల్లాలో ఏర్పాటు చేయతలపెట్టిన సైనిక్ స్కూల్‌ను హైదరాబాద్‌కు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తుంది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని డిఫెన్స్ భూముల్లో దీనిని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఈ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని కేంద్ర రక్షణశాఖను ప్రభుత్వం కోరినట్టు తెలిసింది. ఆరేండ్ల క్రితం దేశవ్యాప్తంగా 21 సైనిక్ స్కూళ్లను కేంద్రం మంజూరుచేసింది. అప్పట్లోనే తెలంగాణకు సైతం ఒక స్కూల్ మంజూరైంది. ఈ స్కూల్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏర్పాటు చేయాలని కేసీఆర్ ప్రభుత్వం అప్పట్లో నిర్ణయించింది. హైదరాబాద్ తర్వాత అంతటి స్థాయి గల వరంగల్‌ను అభివృద్ధి చేయడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నది. ధర్మసాగర్ మండలంలో స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని కూడా పరిశీలించింది. ఆ తర్వాత హసన్‌పర్తిలోని రెవెన్యూశాఖ స్థలాన్ని ఎంపికచేసింది. స్థలం కేటాయింపు ప్రతిపాదనల దశలో ఉన్నది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ ప్రతిపాదన మళ్లీ మొదటికొచ్చింది. ఈ స్కూల్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. దీంట్లో భాగంగానే డిఫెన్స్ స్థలాలివ్వాలని కేంద్రాన్ని కోరినట్టు తెలిసింది. స్థలం కేటాయింపు సాధ్యపడుతుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డిఫెన్స్ స్థలాలిచ్చేందుకు కేంద్రం ససేమిరా అంటుంది. రాష్ట్రంలో జేబీఎస్-తూకుంట రహదారి విస్తరణకు డిఫెన్స్ భూములివ్వమని అడిగితే ఇంతవరకు ఉలుకు లేదు పలుకులేదు. అలాంటిది సైనిక్ స్కూల్ ఏర్పాటుకు భూములిస్తుందా అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.


కరీంనగర్ కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జునను చుట్టుముట్టిన దళితబంధు లబ్ధిదారులు


యాదాద్రి కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న దళితబంధు లబ్ధిదారులు

# కరీంనగర్ కలెక్టరేట్‌లో దళితబంధువుల నిరసన

- ప్రజావాణిలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీని చుట్టుముట్టిన లబ్ధిదారులు

కలెక్టరేట్, జనవరి 22: దళితుల అభ్యున్నతే లక్ష్యంగా తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ప్రారంభించిన దళితబంధు పథకం నిధులను అధికారులు ఫ్రీజింగ్ చేయడంపై హుజూరాబాద్ నియోజకవర్గ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి విడత రూ.5 లక్షలు ఇచ్చి, రెండో విడత ఇవ్వడకపోవడంపై కన్నెర్రజేశారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జమ్మికుంట, వీణవంక, హుజురాబాద్, ఇల్లందకుంట మండలాల నుంచి 60 మంది లబ్ధిదారులు తరలివచ్చారు. హుజురాబాద్ సెగ్మెంట్‌లో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన పథకంలో తమకు తొలి విడత డబ్బులు అందజేశారని, వివిధ యూనిట్లు పెట్టుకొని బతుకుతున్నామని తెలిపారు. అయితే.. రెండో విడత రూ.5 లక్షలు విడుదల చేయకపోగా, ఫ్రీజింగ్ చేశారని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఫ్రీజింగ్ ఎత్తివేయించాలని వేడుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే నిధులు విడుదల చేయాల్సి ఉన్నా.. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నాగార్జున దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడం, ఇతర అధికారులకు ఇన్‌చార్జి కూడా ఇవ్వకపోవడంతో నిధుల విడుదల నిలిచిపోయిందని వాపోయారు. దీంతో పక్కనే ఉన్న ఈడీని అదనపు కలెక్టర్ పిలిచి విచారించారు. ఎన్నికల కోడ్‌తో నిధుల విడుదలకు అనుమతులు రాలేదని వివరించిన ఈడీ.. ఫిర్యాదుదారులను పక్కకు తీసుకెళ్లి మాట్లాడుతుండగా ఒక్కసారిగా చుట్టుముట్టారు. రన్నింగ్ యూనిట్లకు కొత్త ప్రభుత్వ గైడ్‌లైన్స్ అవసరమా? అంటూ ప్రశ్నించారు. కావాలనే తమను ఇబ్బందులు పెడుతున్నారంటూ ధ్వజమెత్తారు. అక్కడే ఉన్న పోలీసులు జోక్యం చేసుకోవడంతో శాంతించారు.

### దళితబంధు నిధులు ఇవ్వాలని వినతిపత్రం

భువనగిరి కలెక్టరేట్: దళితబంధు పథకం నిధులు వెంటనే విడుదల చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు, మోత్కూరు మండలాల లబ్ధిదారులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ జీ వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళితబంధు లబ్ధిదారులు మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రెండు మండలాల్లోని మొత్తం లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.3 లక్షల చొప్పున వేశారని, మిగతా నిధులు విడుదల చేస్తే ఉపాధి మార్గం చూసుకుంటామని పేర్కొన్నారు.

### 'గొర్రెల పంపిణీ'పై ఏసీబీ ఎఫ్ఐఆర్

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీలో జరిగిన అక్రమాలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) సోమవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గొర్రెల పంపిణీలో సుమారు రూ.2.20 కోట్ల అక్రమాలు జరిగాయని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్టు సమాచారం. మాసబ్ ట్యాంక్‌లోని పశుసంవర్ధక శాఖలో మాయమైన ఫైళ్లు, కంప్యూటర్ల గురించి కూడా ఏసీబీ అధికారులు విచారిస్తున్నట్టు తెలుస్తున్నది.

# ధరణి పటిష్టానికి మార్పుచేర్పులు

- త్వరలో కలెక్టర్లు, ఆర్డీవోలతో సమావేశం
- ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక
- అవసరమైతే గ్రామాలకు వెళ్తాం
- ధరణి పునర్నిర్మాణ కమిటీ వెల్లడి

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): ధరణి పోర్టల్‌ను మరింత పటిష్టం చేసేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నట్టు ధరణి పునర్నిర్మాణ కమిటీ పేర్కొంది. ప్రజలు ఇబ్బందులు పడకుండా సాఫ్ట్‌వేర్‌తోపాటు చట్టాల్లో ఎలాంటి మార్పుచేర్పులు చేయవచ్చో ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని తెలిపింది. సీసీఎల్ఏ కార్యాలయంలో కమిటీ సోమవారం సమావేశమైంది. అనంతరం కమిటీ సభ్యులు రేమండ్ పీటర్, సునీల్ కుమార్, మధుసూదన్, కోదండ రెడ్డి, సీఎంఆర్వో ప్రాజెక్ట్ డైరెక్టర్ వీ లచ్చిరెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రేమండ్ పీటర్ మాట్లాడుతూ ధరణిలో లోపాలు సరిదిద్దేందుకు ఏమేం చేయాలో చర్చించినట్టు తెలిపారు. రెండుమూడు రోజుల్లో ఎంపిక చేసిన ఐదారు జిల్లాల కలెక్టర్లతో సమావేశం కానున్నట్టు చెప్పారు. ఆ తర్వాత అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామని వివరించారు. అనంతరం ఆర్డీవోలు, ఎమ్మార్వోలతోనూ సమావేశం అవుతామని చెప్పారు. పోర్టల్‌కు వ్యవసాయం, స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖతోనూ సంబంధాలు ఉన్నాయని, కాబట్టి ఆయా శాఖల అధికారులతో చర్చలు జరుపుతామని తెలిపారు. అనంతరం ప్రభుత్వానికి మధ్యంతర నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. ధరణిలో ఎన్నిరకాల సమస్యలు ఉన్నాయో గుర్తించి, నమూనా కోసం కొన్ని కేస్‌స్టడీలను పరిశీలిస్తామని, అవసరమైతే జిల్లాలు, గ్రామాలకు వెళ్తామని తెలిపారు.

# ఫిబ్రవరి చివర్లో రేషన్ దరఖాస్తులు!

- దరఖాస్తుల స్వీకరణకు సివిల్‌సప్లై కసరత్తు
- అభయహస్తంతో సంబంధం లేకుండానే..
- మళ్లీ మీసేవల్లో దరఖాస్తులకు అవకాశం

హైదరాబాద్, జనవరి 22 (నమస్తే తెలంగాణ): కొత్త రేషన్‌కార్డుల కోసం ఫిబ్రవరి నెలాఖరులో దరఖాస్తులను తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇప్పటికే కొత్త రేషన్‌కార్డుల కోసం ఆరు గ్యారెంటీల దరఖాస్తులతోపాటు విడిగా దరఖాస్తు తీసుకున్నారు. కానీ, వాటిని పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిసింది. గతంలో మాదిరిగానే మీ సేవ ద్వారా దరఖాస్తులు తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇప్పటికే నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్ఐసీ) ద్వారా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించినట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు రేషన్‌కార్డును ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటున్నది. రాష్ట్రంలో చాలా మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో కొత్తగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉండగా 2.86 కోట్ల మంది లబ్ధిదారులన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 6.5 లక్షల కొత్త రేషన్ కార్డులను జారీ చేసింది. తద్వారా సుమారు 20 లక్షల మందికి లబ్ధి జరిగింది.

### తెలంగాణ బాలికకు పీఎం రాష్ట్రీయ బాల పురస్కారం



న్యూఢిల్లీ, జనవరి 22: కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరుస్తున్న తెలంగాణ బాలిక పెండ్యాల లక్ష్మీ ప్రియ(14) సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారం స్వీకరించింది. ఆమెతోపాటు మరో 9 మంది బాలికలు, 9 బాలురకు ఈ పురస్కారాలు లభించాయి. న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము మాట్లాడుతూ ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సంపాదించడం ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు ఆరోగ్యకరమైన పోటీని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.


